పెండింగ్ పనులు పూర్తి చేయండి



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రి

మల్కాజిగిరి/అల్వాల్: నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే పనులు పూర్తిచేయాలని సికింద్రాబాద్ డివిజన్ డీఆర్ఎం గోపాలకృష్ణన్, చీఫ్ ఇంజినీర్ నాగభూషణంకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధమైన ఆర్‌యూబీ, ఆర్‌వోబీల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని కోరామన్నారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. నాయకులు వెంకన్న, అనిల్‌కిషోర్, డోలి రమేష్, చిన్నాయాదవ్, ఉస్మాన్, శ్రీనివాస్, బంటి, భరత్, దినేష్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



బోడుప్పల్: నేరాలను అదుపు చేసేందుకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దానగల్ల యాదగిరి అన్నారు. బోడుప్పల్‌లోని డబుల్‌బెడ్రూం ఇళ్లల్లో రూ.57వేలతో సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపురాం, నానాజీ, శ్రీధర్, ప్రధాన కార్యదర్శి అమరేందర్, గౌరవ అధ్యక్షులు భిక్షపతి, కాలనీవాసులు సంతోష్‌కుమార్, వెంకటేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ

అల్వాల్: జీహెచ్ఎంసీ అల్వాల్ సర్కిల్ సూపరింటెండెంట్ బెండల స్వామి ఉద్యోగ విరమణ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమానికి అల్వాల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డిలు హాజరై ఆయనను సత్కరించారు. 40 ఏళ్ల సర్వీసులో వివిధ హోదాల్లో బాధ్యతాయుతంగా పనిచేసి అందరి మన్ననలను పొంది చిరస్థాయిగా ఉండేలా పదవీవిరమణ పొందారన్నారు. ఏఎంసీ నారాయణ రావు, డీఈలు రఘు, ప్రశాంతి, ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఎస్.ప్రభాకర్, పీఓ మధుమోహన్, ఎంటమాలజిస్ట్ ఏఈ అనిల్, అగ్రికల్చర్ అధికారి ప్రవీణ, జేసీసీ సురేందర్‌రెడ్డి, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యార్థులకు ఆటవస్తువులు

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని 4 అంగన్‌వాడీ కేంద్రాలకు రూపానాయుడు ఆధ్వర్యంలో గురువారం ఆటవస్తువులను అందజేశారు. బీజేపీ మహిళా నాయకురాలు పోకల నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు దేవకరుణ, స్వరూప, వాణి, మిథున, అంగన్‌వాడీ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడిన వ్యక్తి

డీఆర్ఎఫ్ బృందం సాయంతో రక్షించిన పోలీసులు



అల్వాల్: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి సఫిల్‌గూడ చెరువులో పడ్డాడు. వెంటనే సమాచారం అందుకున్న ఎస్సై రమేష్ నేతృత్వంలో పోలీస్ బృందం ఘటన స్థలానికి చేరుకుని తక్షణమే డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందంతో చెరువులో పడిన వ్యక్తిని రక్షించారు. బాధితుడు తుకారంగేట్‌కు చెందిన సన్నీగా గుర్తించారు. మద్యంమత్తులో చెరువులోకి దిగినట్లు తెలిసింది. అనంతరం అతడిని తన కుటుంబసభ్యులకు అప్పగించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

బోడుప్పల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరం మొక్కలు నాటుదామని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం చెంగిచర్లలోని స్కూల్ విద్యార్థులు వనమహోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాలనీవాసులకు మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరం హరితవనంగా మార్చేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు మొక్కలు నాటాలని సూచించారు. స్కూల్ ప్రిన్సిపాల్ నీలిమా, వైస్ ప్రిన్సిపాల్ ఉషాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారి



కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి దంపతులు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

వేడుకగా మహంకాళి బోనాలు

అమ్మవారిని దర్శించుకున్న ప్రజా ప్రతినిధులు ● పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు

ఉప్పల్: మహంకాళి అమ్మవారి శ్రావణమాస బోనాల పండుగను ఉప్పల్‌లో ఇంటింట వేడుకగా నిర్వహించుకున్నారు. ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి బోనాన్ని సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వీధులన్నీ పోతరాజుల నృత్యాలు, శివసత్తుల ఆట పాటలతో మార్మోగాయి. గురువారం ఉదయాన్నే ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు బేతి సుభాష్‌రెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ దంపతులు, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి, తదితరులు హాజరయ్యారు.



ఆలయం వద్ద బోనాలతో భక్తులు

భక్తులకు తగిన ఏర్పాట్లు..

అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. మహంకాళి అమ్మవారి ఆలయం ఎదురుగా బీఆర్ఎస్ నేత వేముల సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాగత మండపాన్ని ఏర్పాటు చేశారు. జానపద నృత్యాలు అమ్మవారి పాటలతో స్వాగత వేదిక ఆకట్టుకుంది.

భారీ బందోబస్తు..

దేవాదాయశాఖ ఆధీనంలోకి తీసుకున్న తర్వాత తొలిసారి బోనాలు జరుగుతున్న వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉప్పల్ డీఐ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు.

చెరువుల సుందరీకరణకు చర్యలు

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గంలోని పలు చెరువుల సుందరీకరణ పనులు త్వరలోనే చేపట్టనున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం హైడ్రా కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గ పరిధిలోని చెరువుల పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాప్రా చెరువు, నాచారం హెచ్ఎంటీనగర్ చెరువు, పటేల్‌కుంట, రామంతాపూర్ పెద్ద చెరువు, చిన్నచెరువుల్లో పూడికతీత పనులు చేపట్టి, సుందరీకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ త్వరలోనే అన్ని చెరువులను పరిశీలించి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

నేడు రామంతాపూర్ చెరువు పరిశీలన..

నేడు రామంతాపూర్ చెరువును పరిశీలిస్తామని కమిషనర్ చెప్పినట్లు ఎమ్మెల్యే బండారి పేర్కొన్నారు.



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

బీఆర్ఎస్ నేతలు సాయిజెనోఖర్, గంధం నాగేశ్వర్‌రావు, నవీన్‌గౌడ్, నేమూరి మహేష్‌గౌడ్, కాలేరు నవీన్, ఇంద్రయ్య, జెట్ట కిషోర్, నిరంజన్‌చారి, రాంరెడ్డి, ఉపేందర్, కట్ట బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



ఆటో కార్మికులకు కేటాయించిన స్థలాన్ని చూపుతున్న వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మల్లికార్జున్ ఆటో యూనియన్ నాయకులు బోడుప్పల్ కమాన్ వద్ద ఆటోలకు పార్కింగ్‌కు స్థలం లేదని వజ్రేష్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన పీర్జాదిగూడ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి ఆటో కార్మికులకు ఉప్పల్ డిపో వద్ద ఆటో స్టాండ్‌కు స్థలం కేటాయించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. నత్తి మైసయ్య, ఆటో యూనియన్ సభ్యులు చిర్ర కుమార్, ఈశ్వర్‌గౌడ్, శ్రీనునాయక్, శివగౌడ్, మల్లేశం, మహంకాళి, యాదగిరి, నర్సింహ్మా పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ముందస్తు ఏర్పాట్లు

మల్కాజిగిరి: వినాయక నిమజ్జన ఏర్పాట్లను ముందస్తుగా చేపట్టాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. గురువారం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమై విగ్రహాలు తీసుకొచ్చేటప్పుడు దెబ్బతినకుండా రహదారుల మరమ్మతులు చేపట్టాలన్నారు. నిమజ్జన ఘాట్ వద్ద కొత్త బోర్లు పూర్తి చేసి నిమజ్జనఘాట్‌లో స్వచ్ఛమైన నీటిలో నిమజ్జనం జరిగేలా చూడాలన్నారు. నిమజ్జనానికి ఏర్పాటు చేసిన క్రేన్‌లలో ఒక్కటి కనీసం 15 రోజులు ఉండేలా చూడాలన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో స్వాగతవేదిక, ఘాట్ వద్ద ఉన్న టాయిలెట్స్‌కు మరమ్మతులు చేయడమే కాకుండా మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిఏటా చేసే సాధారణ ఏర్పాట్లను కూడా పూర్తిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. డీఈ మహేష్, ఏఈ నవీన్, వీఐ రమేష్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రవికిరణ్

మౌలాలి: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలని సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ సూచించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాల మేరకు జెడ్సీ రవికిరణ్ నేతృత్వంలో మౌలాలి డివిజన్ ఓల్డ్ సఫిల్‌గూడ చౌరస్తా, సాయినాథ్‌పురం, గీతానగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో గురువారం పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, ఎంటమాలజీ, పేదరిక నిర్మూలన విభాగం అధికారులు తమ వంతు బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి మలేరియా లార్వా నియంత్రణకు ద్రావణాలను పిచికారి చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకూడదని, ఇంటింటికి వచ్చే పారిశుద్ధ్య వాహనంలో చెత్త వేయాలన్నారు. స్పెషల్ శానిటేషన్ కార్యక్రమాలను ప్రతివార్డుకు రెండు రోజుల చొప్పున చేపట్టాలని ఆదేశించారు. రోజూ ఉదయం 5.30 గంటలకు హాజరుకావాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఈఈ లక్ష్మణ్, డీఈ మహేష్, ఏఈ మధురిమ, వైద్యాధికారిణి మంజుల, ఉమామహేశ్వరి యుబీడీ, టౌన్‌ప్లానింగ్, పారిశుద్ధ్యం, ఎంటమాలజీ, పట్టణ పేదరిక నిర్మూలన విభాగ అధికారులు రవీందర్, శ్రీనివాసరావు, మల్లిఖార్జున్, పుష్ప, శ్రీనివాస్, వనజ, అహమ్మద్, అజయ్, యాదగిరి, భారతి, అంజమ్మ, కిష్టమ్మ, రవి, గీతానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ టెక్నికల్ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ కౌశిక్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ అకడమిక్ హైట్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఇన్వెస్టర్ సెర్మనీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి, క్రమశిక్షణ బాధ్యతాయుత ప్రవర్తనకు ఇలాంటి ఎన్నికలు దోహదపడతాయన్నారు. ప్రిన్సిపాల్ నీలిమా దేవి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై 'ప్రీ మాన్‌సూన్' స్పెషల్ డ్రైవ్



అల్వాల్‌లో మ్యాన్‌హోల్స్ శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

కాప్రా: వర్షాకాల ముందస్తు చర్యల్లో భాగంగా కాప్రా సర్కిల్ అధికారులు 4వ విడత ప్రీ మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గురువారం ఏఎస్‌రావునగర్ డివిజన్ అనుపురం కాలనీ, కాప్రా డివిజన్ శ్రీరాంనగర్ కాలనీ, అశోక్‌నగర్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వర్షాలతో రోడ్లపై పేరుకుపోయిన ఇసుకమేటలు, చెత్తను తొలగించారు. అనంతరం దోమల నివారణకు రోడ్లకు ఇరువైపుల, ఖాళీస్థలాలు, డ్రైనేజీల్లో లార్వాను గుర్తించి స్ప్రే చేశారు. తక్షణమే రోడ్లకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేందర్, డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, టౌన్‌ప్లానింగ్ డీసీపీ కృష్ణమోహన్, యూసీడీ సెక్షన్ డీపీఓ దామోదర్ రెడ్డి, డీసీఎస్‌డబ్ల్యూఎం గోపాల్, ఏఎంహెచ్ఎంఓ మధుసూదన్‌రావు, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్: మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం పారిశుద్ధ్య కార్మికులు అల్వాల్ సర్కిల్ లక్ష్మీకళా థియేటర్ రోడ్డు సిబ్బందిచే డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేయించారు. వెంకటేష్, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు న్నారు.

ఇష్టానుసారంగా వ్యర్థాలు పారేస్తే ఎలా ?



చెత్తను డంప్ చేస్తున్న స్వీపర్లు

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని రాంరెడ్డినగర్ కమాన్ వద్ద ఇతర ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను ఆటోరిక్షాలో తీసుకొచ్చి జీహెచ్ఎంసీ స్వీపర్లు డంప్ చేస్తున్నారు. దీంతో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయని ఆ కాలనీవాసులు వాపోతున్నారు. చెత్తను పారబోయకుండా కాపలా ఉండే వారే తిరిగి వ్యర్థాలను తీసుకొచ్చి డంప్ చేయడంతో పాటు వాహనదారులు వచ్చి చెత్తను పారవేస్తున్నారని, దీంతో దుర్వాసన వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: కాలనీల అభివృద్ధి అంశంలో కాలనీ సంక్షేమ సంఘాలు భాగస్వామ్యం కావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. చర్లపల్లి డివిజన్, సాయిఎన్‌క్లేవ్‌లో గురువారం నిర్వహించిన సంక్షేమ సంఘం భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ సంఘాలు కాలనీవాసులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు వారధులుగా ఉంటూ కాలనీలను అభివృద్ధి పథంలో నిలుపుకోవాలన్నారు. స్థానిక నేతలు, కాలనీ సంక్షేమసంఘాల ప్రతినిధులు నేమూరి మహేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, పద్మారెడ్డి, కృష్ణ, నరసింహారెడ్డి, రహీం, తాళ్ల వెంకటేష్‌గౌడ్, జయకృష్ణ, సంపత్, ప్రసాద్‌రెడ్డి, చల్లా వెంకటేశం, శేఖర్‌నాయక్, బాలాజీ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన

మౌలాలి: మౌలాలి డివిజన్ ద్వారకామయి కాలనీ ఫేజ్–2లో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. అనంతరం నూతనంగా నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు జోగు కుమార్‌స్వామి, సంపత్‌లు, కమిటీ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సుమారు 500 మందికి అన్నప్రసాద వితరణ చేపట్టారు. కాలనీ కమిటీ సభ్యులు చంద్రకాంత్, వీరయ్యగుప్తా, పెంటయ్య, మల్లయ్య, బాలాజీ, శ్రీశైలం, నర్సింగ్‌రావు, రవికుమార్, నాగేశ్వర్, సిద్ధి రాములు, కిరణ్‌గౌడ్, శ్రీనివాసరావు, మధుకర్‌గుప్తా, వాల్యానాయక్ కాలనీ మహిళలు పాల్గొన్నారు.



ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న కాలనీవాసులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: ఎస్ఎండీసీ కాలనీ, అనంతసరస్వతీనగర్ కాలనీల్లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఇటీవల రెండు కాలనీల ప్రతినిధులు కార్పొరేటర్‌ను సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఇంజినీరింగ్, జలమండలి అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. బాక్స్‌డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న రహదారుల (సీసీరోడ్డు) నిర్మాణం, విద్యుత్ స్తంభాల మార్పిడి, తాగునీటి సరఫరా తగినంత ప్రెషర్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులు మంజూరయ్యేలా చూస్తానన్నారు. ఏఈ దివ్యజ్యోతి, మేనేజర్ తేజస్విని, వీఐ రజనీకాంత్ తదితరులున్నారు

సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామం చేయాలి

బోడుప్పల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం కోసం వ్యాయామం చేయాలని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. చెంగిచర్లలోని కనకదుర్గ, చిన్న క్రాంతి, రాజేష్‌నగర్ కాలనీల్లో ఓపెన్‌జిమ్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీ ప్రజలు వ్యాయామం చేసేందుకు జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటితో పాటు మరో 7 కాలనీల్లో 7 జిమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అనంతరం కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్యాయాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.



ఓపెన్‌జిమ్ శంకుస్థాపనలో పాల్గొన్న కమిషనర్ శైలజ

మానసిక రోగులకు సేవ చేయడం గొప్ప కార్యం



మాట్లాడుతున్న ఆయుష్ డైరెక్టర్ లింగరాజు తదితరులు

ఉప్పల్: మానసిక రోగులకు సేవ చేయడమే నిజమైన మాధవ సేవ అని రామంతాపూర్ హోమియో కళాశాల ప్రిన్సిపాల్, ఆయుష్ అడిషనల్ డైరెక్టర్ డా.లింగరాజు అన్నారు. గురువారం ఉప్పల్ సరస్వతీ కాలనీలోని 'మీన్ మెంటల్ హెల్త్ కేర్ హోమ్'ను హోమియోపతి కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు సందర్శించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లింగరాజు, మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ వెంకట రమణలు హాజరై హోమ్ నిర్వాహకులు చేస్తున్న సేవలు స్వయంగా చూపించారు. దాదాపు 60 మంది మానసిక రోగులను సహజ పద్ధతిలో వారికి వైద్యం చేస్తూ.. వారికి ఉన్న రుగ్మతలను నయం చేసి సాధారణ మనుషులుగా మార్చడం గొప్ప అని కొనియాడారు. ప్రముఖ సైక్యాట్రిస్ట్ లోకేష్ చౌహాన్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు త్వరలో పరిష్కారం

కుషాయిగూడ: త్వరలోనే కృష్ణారెడ్డినగర్ కాలనీ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని కృష్ణారెడ్డినగర్, శివసాయినగర్, శుభోదయ కాలనీల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొలివిడత స్టామ్ వాటర్ లేన్ పనులు జరుగుతున్నాయని, ఆ పనులు పూర్తికాగానే రెండో విడత డీమార్ట్ నుంచి కృష్ణారెడ్డినగర్ వరకు పనులు ప్రారంభమైతే ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. శుభోదయ కాలనీలో డ్రైనేజీ సమస్యతో నిత్యం పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కారించుకోవాలని సూచించారు. వాటర్‌వర్క్స్ ఏఈ సందీప్, స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, మల్లేష్, రవీందర్‌రావు, శ్రీను, మహేందర్‌గౌడ్, విజయ్‌కుమార్, యాదగిరి, తారకేశ్వర్, ఐలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీదేవి

రోడ్డుకు మరమ్మతులు చేయరూ !



భవానీనగర్‌లో విద్యార్థులు వెళ్తున్న ఆటో

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని భవానీనగర్ కాలనీ కమాన్ నుంచి కేఎల్‌రెడ్డినగర్ వెళ్లే వరకు రోడ్డు మధ్యలో నీటి కనెక్షన్ల కోసం రోడ్డు తవ్వడంతో లోతైన గుంతలు ఏర్పడ్డాయి. వీటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడతున్నారు. సీసీరోడ్లను తవ్వి వదిలేశారని, దీనిపై ఇంజినీరింగ్ అధికారులు ఇప్పటివరకు పట్టించుకోకపోవడం శోచనీయమని స్థానికులు వాపోతున్నారు. రోడ్లను తవ్వేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.